నమస్తే తెలంగాణ
మంచిర్యాల
కుమ్రం భీం ఆసిఫాబాద్
5 | బుధవారం 17 ఏప్రిల్ 2024 | MANCHERIAL KUMURAM BHEEM ASIFABAD

# పార్లమెంట్ ఎన్నికలకు సహకరించాలి

**జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వెంకటేశ్ దోత్రే**


మాట్లాడుతున్న జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వెంకటేశ్ దోత్రే

ఆసిఫాబాద్ టౌన్, ఏప్రిల్ 16 : పార్లమెంట్ ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు రాజకీయ పార్టీలు సహకరించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వెంకటేశ్ దోత్రే అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో ఎస్పీ సురేశ్‌కుమార్, జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) దాసరి వేణుతో కలిసి ఎన్నికల విభాగం అధికారులు, గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమీక్ష నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ మే 13న పోలింగ్, జూన్ 4న కౌంటింగ్ జరుగుతుందన్నారు. జూన్ 6 వరకు ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులో ఉంటుందన్నారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి లోకేశ్వర్ రావు, ఆసిఫాబాద్ డీఎస్పీ సదయ్య పాల్గొన్నారు.

# ఏసీపీ కొడుకు సివిల్స్ ర్యాంకర్

**ఆల్ ఇండియాలో 718 ర్యాంకు సాధించిన విశాల్**


తల్లిదండ్రులతో ఆరే విశాల్

జైపూర్, ఏప్రిల్ 16 : యూపీఎస్సీ ఫలితాల్లో జైపూర్ ఏసీపీ ఆరే వెంకటేశ్వర్ కుమారుడు ఆరే విశాల్ ఆల్ ఇండియాలో 718 ర్యాంకు సాధించాడు. ఆదిలాబాద్ జిల్లా చాంద-టీకి చెందిన ఆరే విశాల్ ఎన్టీపీసీ రామగుండంలో ఒకటి నుంచి నాలుగు, తుఫ్రాన్ రెసిడెన్సియల్‌లో 5వ తరగతి నుంచి 10వ తరగతి వరకు చదువుకున్నాడు. హైదరాబాద్‌లోని నారాయణ కాలేజీలో ఇంటర్ పూర్తి చేశాడు. ఆ తర్వాత ఉత్తరాఖండ్‌లోని రుర్కీ కళాశాలలో 2020లో బీటెక్ మెకానికల్ పూర్తి చేశాడు. అప్పటి నుంచి ఆన్‌లైన్ ద్వారా సివిల్స్ కోచింగ్ తీసుకుంటూ ప్రిపేర్ అవుతున్నాడు. రోజుకు 12 గంటల నుంచి 16 గంటల వరకు చదివేవాడని తండ్రి వెంకటేశ్వర్ తెలిపారు. తన కూతురు కూడా ఎంబీబీఎస్ పూర్తి చేసి పీజీ ప్రిపేర్ అవుతున్నట్లు చెప్పారు. యూపీఎస్సీ ఆల్ ఇండియా ఫలితాల్లో 718వ ర్యాంకు సాధించడంపై విశాల్ ఆనందం వ్యక్తం చేశారు. బీసీ రిజర్వేషన్‌లో ఐపీఎస్ రావచ్చని ఆశిస్తున్నట్లు తెలిపారు.


మోడీ పాఠశాలలో విద్యార్థులతో మాట్లాడుతున్న ఉట్నూర్ ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా

# విద్యార్థులకు మెరుగైన విద్యనందించాలి

- విధులను నిర్లక్ష్యం చేస్తే చర్యలు తప్పవు
- ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా

కెరమెరి, ఏప్రిల్ 16 : ఆశ్రమ పాఠశాల విద్యార్థులకు నాణ్యమైన భోజనంతో పాటు మెరుగైన విద్యనందించాలని, విధులను నిర్లక్ష్యం చేస్తే చర్యలు తప్పవని ఉట్నూర్ ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి ఖుష్బూ గుప్తా పేర్కొన్నారు. మంగళవారం మోడీ, రాంజీగూడ ఆశ్రమ ఉన్నత పాఠశాలలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. హాజరు పట్టిక, స్టాక్ రిజిస్టర్‌లను పరిశీలించారు. పీవో మాట్లాడుతూ ప్రతిరోజూ మెనూ ప్రకారం భోజనం అందించాలని సూచించారు. సబ్జెక్టుల వారీగా విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో విద్యాబోధన చేయాలని పేర్కొన్నారు. పాఠశాల, వసతి గృహాల్లో నిత్యం పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టాలని, వంట గది, స్టోర్ రూం, తాగునీరు, మరుగుదొడ్లు రోజూ శుభ్రంగా ఉంచాలని ఆదేశించారు. రాంజీగూడ పాఠశాల ఉపాధ్యాయుల పనితీరు అసంతృప్తిగా ఉండడంతో ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


వాల్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఆసిఫాబాద్ ఎస్పీ సురేశ్‌కుమార్

# యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

**ఆసిఫాబాద్ ఎస్పీ సురేశ్‌కుమార్**

ఆసిఫాబాద్ టౌన్, ఏప్రిల్ 16 : యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని ఎస్పీ సురేశ్‌కుమార్ అన్నారు. మంగళవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో తెలంగాణ రాష్ట్ర యాంటీ నార్కోటిక్స్ బ్యూరో ఆధ్వర్యంలో గంజాయి, కల్తీ కల్లు వినియోగం వల్ల కలిగే అనర్థాలపై రూపొందించిన వాల్ పోస్టర్‌ను పోలీస్ అధికారులతో కలిసి ఆయన ఆవిష్కరించారు. ఎస్పీ మాట్లాడుతూ గంజాయి, మత్తు పదార్థాల నిర్మూలనకు ప్రజలందరూ స్వచ్ఛందంగా ముందుకు రావాలని, విక్రయాలకు పాల్పడేవారి సమాచారాన్ని ఇవ్వాలని కోరారు. ఫిర్యాదుల కోసం టోల్ ఫ్రీ నంబర్ 8712671111 సంప్రదించాలన్నారు. గంజాయి రహిత జిల్లా కోసం అధికారులు, సిబ్బంది కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమములో అదనపు ఎస్పీ అడ్మిన్ ప్రభాకర్ రావు, ఆసిఫాబాద్ డీఎస్పీ సదయ్య, ఆసిఫాబాద్ టౌన్ సీఐ సతీశ్, డీసీఆర్బీ సీఐ రమేశ్, ఆర్ఐ అడ్మిన్ పెద్దయ్య పాల్గొన్నారు.


పంటలను పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయశాఖ అధికారి కల్పన

# నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు

**జిల్లా వ్యవసాయ అధికారి కల్పన**

నెన్నెల, ఏప్రిల్ 16 : విత్తనాలు, ఎరువుల విక్రయాల దుకాణా యజమానులు నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవని జిల్లా వ్యవసాయశాఖ అధికారి కల్పన హెచ్చరించారు. మంగళవారం నెన్నెలలో ఎరువులు, విత్తన దుకాణాలను తనిఖీ చేసి, పలు సూచనలు చేశారు. డీలర్లు నాణ్యమైన విత్తనాలు సకాలంలో తెప్పించి రైతులకు విక్రయించాలని సూచించారు. ఎరువులు, విత్తనాలను ఎమ్మార్పీ ధరలకే విక్రయించాలని ఆదేశించారు. అనంతరం మండలంలోని జోఘపూర్ గ్రామంలోని వరి, కూరగాయ పంటల సాగును పరిశీలించారు. పంటల్లో ప్రస్తుతం చేపట్టాల్సిన యాజమాన్య పద్ధతుల గురించి వివరించారు. కూరగాయల సాగులో రసం పీల్చు పురుగుల ఉధృతి ఎక్కువగా ఉందని, వాటిని నివారించడంపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఏవో ప్రేమ్ కుమార్, ఏఈవో సుప్రజ, రైతులు పాల్గొన్నారు.

# శ్రీ సీతారాముల కల్యాణము చూతము రారండి

**నేడు ఊరూరా వివాహ మహోత్సవం**

*రాములోరి కల్యాణ వేడుకలను బుధవారం అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు ఊరూరూ ముస్తాబైంది. ఆలయాలను రంగురంగుల విద్యుద్దీపాలతో అలంకరించారు. చలువ పందిళ్లు, షామియానాలు, బారికేడ్లు తదితర సౌకర్యాలు కల్పించారు. భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చే అవకాశముండగా, అందుకనుగుణంగా ఆలయ కమిటీలు వసతులు కల్పించాయి. తాగు నీరు, అన్నదానానికి ఏర్పాట్లు చేశారు. ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసు బందోబస్తు నిర్వహిస్తున్నారు.*


ముస్తాబైన పాత మంచిర్యాలలోని శివరామలింగేశ్వర ఆలయం


ఆదిలాబాద్ పార్లమెంట్ బూత్ స్థాయి కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి, బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

# గులాబీ శ్రేణులకు.. కేటీఆర్ దిశానిర్దేశం


మాట్లాడుతున్న ఆదిలాబాద్ ఎంపీ అభ్యర్థి ఆత్రం సక్కు

**ఉత్సాహం నింపిన యువనేత పర్యటన**

- భారీగా తరలివచ్చిన బీఆర్‌ఎస్ కార్యకర్తలు
- అడుగడుగునా యువకిశోరం ప్రసంగానికి యువత కేరింతలు

ఆదిలాబాద్, ఏప్రిల్ 16(నమస్తే తెలంగాణ) : పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆదిలాబాద్ జిల్లా పర్యటన గులాబీ శ్రేణుల్లో ఉత్సాహాన్ని నింపింది. మంగళవారం ఓ ప్రైవేటు ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించిన ఆదిలాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ బూత్ స్థాయి సమావేశంలో కార్యకర్తలకు యువనేత కేటీఆర్ దిశానిర్దేశం చేశారు. పార్లమెంట్ పరిధిలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలోని ముఖ్యనాయకులు, కార్యకర్తలు హాజరయ్యారు. కేటీఆర్ మాట్లాడుతూ.. ఆదిలాబాద్ నియోజకవర్గంలో బీఆర్‌ఎస్ విజయం సాధిస్తుందన్నారు. పార్లమెంట్ పరిధిలో నిర్మల్, ముథోల్, కాగజ్‌నగర్ అసెంబ్లీ నియోజకవర్గాల్లో నాయకులు పార్టీని వీడినా నష్టం ఏమి లేదన్నారు. బీ ఆర్‌ఎస్ అధికారంలోకి వచ్చిన తర్వాత రెండు సార్లు మంత్రి పదవి అనుభవించినా కూడా.. ఓటమి తర్వాత పదవుల కోసం పార్టీలు మారినట్లు తెలిపారు. ఆసిఫాబాద్ సిట్టింగ్ ఎమ్మెల్యేగా ఉన్న ఆత్రం సక్కు సేవలు పార్టీకి, రాష్ట్రానికి, ఆదిలాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ ప్రజలకు అవసరమని గుర్తించిన బీఆర్‌ఎస్ అధినేత ఎంపీగా పోటీ చేసే అవకాశం కల్పించారన్నారు. నాయకులు, కార్యకర్తలు గ్రామస్థాయిలో కష్టపడి బీఆర్‌ఎస్ విజయానికి కృషి చేయాలని కోరారు.

**బీజేపీ, కాంగ్రెస్ వైఫల్యాలు ఎండగట్టాలి..**

పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు గ్రామాల్లో బీజేపీ, కాంగ్రెస్ ప్రభుత్వాల వైఫల్యాలని ప్రజలకు తెలియజేయాలని యువకిశోరం కేటీఆర్ సూచించారు. కేంద్ర ప్రభుత్వ పరిధిలో ఉన్న ఆర్మూర్, ఆదిలాబాద్ రైల్వేలైన్, విమానాశ్రయం ఏర్పాటు, సిమెంటు పరిశ్రమ పునఃప్రారంభం లాంటి విషయాలను ప్రజలకు తెలియజేయాలని కోరారు. కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రంలో అధికారంలోకి వచ్చి నాలుగు నెలలు గడచినా ఎన్నికల హామీలను నెరవేర్చలేదని తెలిపారు. రైతుబంధు, రూ.2 లక్షల రుణమాఫీ, తులం బంగారం, గ్రామాల్లో మంచినీరు, సాగునీటి సమస్యలను ఎండగట్టాలన్నారు. పదేండ్ల కేసీఆర్ పాలనలో అమలు చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను వివరించాలన్నారు. కేసీఆర్ ప్రభుత్వం ఇచ్చిన 2 లక్షల ఉద్యోగాలను యువతకు తెలియజేయాలని సూచించారు. పార్లమెంట్‌లో బీఆర్‌ఎస్ ఎంపీల ఆవశ్యకతను తెలియజేయాలని సూచించారు. కేటీఆర్ ప్రసంగం నాయకులు, కార్యకర్తల్లో ఉత్సాహాన్ని నింపింది. యువనేత కేటీఆర్ ప్రసంగానికి గులాబీ శ్రేణులు కేరింతలు కొట్టారు. ఆయనను కలువడానికి, ఫొటోలు దిగడానికి పోటీ పడ్డారు. ఈ సమావేశంలో బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్, మాజీ మంత్రి జోగు రామన్న, ఎంపీ అభ్యర్థి ఆత్రం సక్కు, కుమ్రం భీం మనవడు సోనేరావు, జడ్పీ చైర్మన్‌లు రాథోడ్ జనార్దన్, విజయలక్ష్మీ, ఖానాపూర్ ఇన్‌చార్జి జాన్సన్ నాయక్, మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్, ముథోల్ నియోజకవర్గ పార్లమెంట్ సమన్వయ కమిటీ సభ్యులు రమాదేవి, విలాస్ గాదేవార్, లోలం శ్యాంసుందర్, కిరణ్ కొమ్మేవార్, నాయకులు సుభాష్, యూనిస్ అక్బానీ, అజయ్, జోగు మహేందర్, లింగారెడ్డి, గోవర్ధన్ పాల్గొన్నారు.

**కేసీఆర్‌కు గెలుపును బహుమతిగా ఇద్దాం..**

*బీఆర్‌ఎస్‌ను గెలిపించి తమ అధినేత కేసీఆర్‌కు బహుమతిగా ఇద్దామని ఎంపీ అభ్యర్థి ఆత్రం సక్కు అన్నారు. కేసీఆర్ జిల్లాలోని గిరిజన ప్రాంతాల అభివృద్ధికి పెద్దపీట వేశారని, రిజర్వేషన్లను 10 శాతానికి పెంచడం, పోడు భూములకు పట్టాల పంపిణీ, జోడేఘాట్‌లో మ్యూజియం ఏర్పాటు, దండారీ ఉత్సవాలు, ఆలయాలు, జాతరలకు నిధులు మంజూరు చేసినట్లు తెలిపారు. బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు ప్రజలకు ఇచ్చిన ఏ ఒక్క హామీని అమలు చేయలేదన్నారు. రైతుబంధు, రుణమాఫీ, తాగునీరు, సాగునీరు, కల్యాణలక్ష్మి ఇతర పథకాలు బీఆర్‌ఎస్ పార్టీతోనే సాధ్యమవుతాయని ఈ విషయాన్ని ప్రజలకు తెలియజేయాలని కోరారు.*

**- ఆత్రం సక్కు, ఆదిలాబాద్ ఎంపీ అభ్యర్థి**

# పట్టుదలతో చదివి లక్ష్యాన్ని చేరుకోవాలి

**మంచిర్యాల కలెక్టర్ బదావత్ సంతోష్**


మాట్లాడుతున్న కలెక్టర్ బదావత్ సంతోష్

నస్పూర్, ఏప్రిల్ 16 : పోటీ పరీక్షలకు సన్నద్ధమవుతున్న నిరుద్యోగులు ప్రతి అంశంపై అవగాహన పెంచుకోవాలని కలెక్టర్ సంతోష్ అన్నారు. మంగళవారం నస్పూర్‌లోని కలెక్టరేట్‌లో హైదరాబాద్‌కు చెందిన ఎకేఎస్, ఐఏఎస్ అకాడమీ నిర్వహించిన అవగాహన సదస్సుకు అదనపు కలెక్టర్, జిల్లా గ్రంథాలయ సంస్థ ఇన్‌చార్జి రాహుల్, తెలుగు విశ్వ విద్యాలయం అసిస్టెంట్ ప్రొఫెసర్ శ్రీనివాసన్, అకాడమీ ప్రతినిధి హర్షతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం నిర్వహించనున్న వివిధ పోటీ పరీక్షలకు సన్నద్ధమవుతున్న అభ్యర్థులు ఏకాగ్రత, పట్టుదలతో చదివి లక్ష్యాన్ని చేరుకోవాలని సూచించారు. అదనపు కలెక్టర్ మాట్లాడుతూ పోటీ పరీక్షలకు సన్నద్ధమవుతున్న అభ్యర్థుల కోసం గ్రంథాలయాల్లో పత్రికలు, పుస్తకాలు, మెటీరియల్ అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. అనంతరం అకాడమీ ద్వారా గ్రూప్ పరీక్షల సిలబస్ ప్రతులు, నమూనా పరీక్షా పత్రాలను అభ్యర్థులకు అందజేశారు. జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి రాజు, గ్రంథ పాలకులు మురళీ, సిబ్బంది కృతిన్, సంపత్, చక్రవర్తి పాల్గొన్నారు.

**ప్రతి ఒక్కరూ ఓటు హక్కు వినియోగించుకోవాలి**

నస్పూర్, ఏప్రిల్ 16 : మే 13న జరిగే పార్లమెంట్ ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ ఓటు హక్కు వినియోగించుకోవాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ బదావత్ సంతోష్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. చెన్నూరు, బెల్లంపల్లి, మంచిర్యాల నియోజకవర్గాల్లో మొత్తం 741 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు పకడ్బందీ చర్యలు తీసుకుంటున్నట్లు, ఎన్నికల విధులు కేటాయించబడిన అధికారులు పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కు వినియోగించుకోవాలని పేర్కొన్నారు.

# ట్రేడ్ పరీక్షలకు అవకాశం

మంచిర్యాలటౌన్, ఏప్రిల్ 16: ఐటీఐకి సంబంధించి ఏదేని ట్రేడ్‌లో అనుభవం ఉన్న అభ్యర్థులకు సంబంధిత ట్రేడ్ పరీక్షలకు (ఏఐటీ) హాజరయ్యే అవకాశాన్ని ఉపాధి, శిక్షణ శాఖ కల్పిస్తున్నట్లు మంచిర్యాల ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపాల్ ఎం చందర్ ఓ ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఐటీఐలలో ఏదైనా ట్రేడ్‌కి సంబంధించి ప్రభుత్వ, ప్రైవేటు రంగ సంస్థల్లో ఎస్సెస్సీ పాసైన వారు , మూడేళ్ల సంబంధిత ట్రేడ్‌లో అనుభవం కలిగి ఈపీఎఫ్, ఈఎస్ఐ కలిగిన వారు సంబంధిత ట్రేడ్ సర్టిఫికెట్ పొందడం కోసం ఈ నెల 19వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని కోరారు. వరంగల్‌లోని రీజినల్ డిప్యూటీ డైరెక్టర్ కార్యాలయం (ములుగురోడ్)లో నేరుగా వెళ్లి దరఖాస్తు చేసుకోవచ్చని ఆయన తెలిపారు. కేటగిరీ-1 కింద ఎక్స్ ట్రైనీలు (విజయవంతం అయిన పాస్ -అవుట్‌లు), కేటగిరీ-2 కింద మాజీ ట్రైనీలు (విజయవంతం అయిన పాస్ -అవుట్‌లు), సీవోఈ పథకం కింద ప్రస్తుత ట్రైనీలు, కేటగిరీ-3 కింద ఎస్‌సీవీటీ అభ్యర్థులు (ఆగస్టు 2018 సెషన్ వరకు అడ్మిట్ పొందిన వారు), కేటగిరీ-4 కింద ఇతర అభ్యర్థులు (అడ్మిషన్ సెషన్ 2019 నుంచి నమోదు చేసుకున్న ఎస్‌సీవీటీ ట్రైనీలతో సహాపైన పేర్కొన్న మూడు కేటగిరీలలో దేనిలోనైనా విఫలం కాని అభ్యర్థులు) దరఖాస్తు చేసుకోవచ్చునని తెలిపారు.

# నకిలీ పత్తి విత్తనాలు పట్టివేత

కన్నెపల్లి, ఏప్రిల్ 16 : వెంకటాపూర్ గ్రామంలో మంగళవారం నకిలీ పత్తి విత్తనాలు పట్టుకున్నట్లు ఎస్ఐ గంగారాం తెలిపారు. నకిలీ విత్తనాలు విక్రయిస్తున్నారన్న సమాచారం మేరకు భీమిని మండల వ్యవసాయాధికారి విజయ్‌కుమార్‌తో కలిసి వెళ్లి తనిఖీలు నిర్వహించగా, పార్వతి వెంకటేశం ఇంట్లో రెండున్నర కిలోల నకిలీ పత్తి విత్తనాలు పట్టుబడ్డట్లు ఎస్ఐ గంగారాం తెలిపారు.

# నియోజకవర్గ సమన్వయకర్తల నియామకం

పెద్దపల్లి, ఏప్రిల్16 : పెద్దపల్లిపార్లమెంట్‌కు సంబంధించి నియోజకవర్గ సమన్వయకర్తలను నియమించినట్లు బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మంగళవారం తెలిపారు. పెద్దపల్లి పార్లమెంట్ పరిధిలోని చెన్నూరు నియోజకవర్గానికి మంచిర్యాల జడ్పీ వైస్ చైర్మన్ తొంగల సత్యనారాయణ, బెల్లంపల్లికి పెద్దపల్లి జిల్లా ఓదెల జడ్పీటీసీ గంట రాములు, మంచిర్యాలకు రాష్ట్ర పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ కోలేటి దామోదర్ గుప్తా, రామగుండంకు టీఎస్‌టీఎస్ మాజీ చైర్మన్ సీఎచ్ రాకేశ్‌కుమార్, మంథనికి బీఆర్‌ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు ఓరుగంటి రమణారావు, పెద్దపల్లికి రాష్ట్ర పౌర సరఫరాల సంస్థ మాజీ చైర్మన్ సర్దార్ రవీందర్ సింగ్, ధర్మపురికి పెద్దపల్లి జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ రఘువీర్ సింగ్‌ను నియమించారు.

# 'మథర్ థెరిసా' యాజమాన్యం తీరు సరికాదు

**పెద్దపల్లి బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్**

దండేపల్లి, ఏప్రిల్ 16 : కన్నెపల్లి మథర్ థెరిసా పాఠశాల యాజమాన్యం హనుమాన్ మాల ధరించిన విద్యార్థుల పట్ల వ్యవహరించిన తీరు సరికాదని మాజీ మంత్రి, పెద్దపల్లి టీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్ అన్నారు. కన్నెపల్లి మథర్ థెరిసా పాఠశాలలో జరిగిన ఘటనపై ఆయన స్పందించారు. ఈ విషయంపై ఉన్నత విద్యాశాఖ అధికారులు స్పందించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలన్నారు. అన్ని కులమతాలను సమానంగా గౌరవించే భారత దేశంలో ఇలాంటి ఘటనలు జరగడం దురదృష్టకరమని అన్నారు.


బయట నుంచి నీటిని తెస్తున్న వ్యక్తి


బయట నుంచి కొని తీసుకొచ్చిన నీటి క్యాన్

# 'మాతా శిశు'వుకు తప్పని తిప్పలు

*మంచిర్యాలలోని కాలేజ్ రోడ్‌లో గల మాతా శిశు సంరక్షణ కేంద్రంలో నిర్వహణ లోపం కొట్టొచ్చినట్లు కనిపిస్తున్నది. కనీస సౌకర్యాలు లేక బాలింతలు, గర్భిణులు, వారి కుటుంబ సభ్యులు అవస్థలు పడుతున్నారు. వాటర్ ప్యూరీఫయర్, ఫ్రిడ్జిలు పాడైపోయి నెలలు గడుస్తున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యాడు. గుక్కెడు నీటి కోసం అష్టకష్టాలు పడాల్సి వస్తున్నది. తప్పనిసరి పరిస్థితుల్లో బయట నీటి క్యాన్‌లు కొనుక్కోవాల్సి వస్తున్నది. ఇక ఫ్యాన్‌లు, ఏసీలు పనిచేయకపోవడంతో ఉక్కపోతకు తల్లులతో పాటు శిశువులు కూడా సతమతమవుతున్నారు. తట్టుకోలేక ఇంటి నుంచి ఫ్యాన్లు, కూలర్లు తెచ్చుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. పగవాడికి కూడా ఇంత కష్టం రావద్దని ఒకరికొకరు మాట్లాడుకోవడం కనిపించింది. మంగళవారం 'నమస్తే తెలంగాణ' దవాఖానను విజిట్ చేసి.. పేషెంట్లు పడుతున్న అవస్థలను తన కెమెరాలో బంధించింది.*

**- మంచిర్యాల స్టాఫ్ ఫొటోగ్రాఫర్**


పాడైపోయిన ఫ్రిడ్జ్


చెడిపోయిన వాటర్ ప్యూరీఫయర్


ప్రతి బెడ్ వద్ద కూల్ వాటర్ క్యాన్లు, కూలర్లు